3న పల్స్ పోలియో

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 22: వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మార్చి 3న పల్స్ పోలియో నిర్వహించేందుకు వైద్య శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గురువారం శ్రీరాంనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అంగన్‌వాడీ, ఆశ వర్కర్లతో వైద్య సిబ్బంది సమావేశమయ్యారు. 5 ఏండ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. యూసుఫ్‌గూడ సర్కిల్‌లోని యూసుఫ్‌గూడ, బోరబండ, ఎర్రగడ్డ, రహ్మత్‌నగర్, వెంగళరావునగర్ డివిజన్లలో ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా అపార్ట్‌మెంట్లలో పల్స్‌పోలియో కేంద్రాలను ఏర్పాటుచేయనున్నారు.

పరిసరాల పరిశుభ్రతకు పాటుపడాలి

బండ్లగూడ, ఫిబ్రవరి 22: పరిసరాల పరిశుభ్రత కోసం మరింత కష్టపడాలని రాజేంద్రనగర్ జీహెచ్ ఎంసీ ఉప కమిషనర్ రవికుమార్ పారిశుధ్య సిబ్బందిని ఆదేశించారు. రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో ఆయన గురువారం పారిశుధ్య కార్మికులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అన్ని బస్తీల్లో ఉదయం చెత్త సేకరణతో పాటు రోడ్లపై ఎక్కడా చెత్తా చెదారం కనిపించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నీరు నిల్వ ఉన్నచోట బ్లీచింగ్ పౌడర్, రసాయనాలను చల్లాలన్నారు. ఫిర్యాదులు అందిన వెంటనే పరిష్కరానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.

వీగిన మణికొండ మున్సిపాలిటీ అవిశ్వాసం

- 13మందికి పది మంది కౌన్సిలర్ల హాజరు..
- వ్యూహం బెడిసి కొట్టడంతో బోల్తాపడ్డ అసమ్మతి వర్గం
- బెదిరింపులకు పాల్పడ్డారు: ఫ్లోర్‌లీడర్ ఆర్‌కే
- చివరకు ధర్మమే గెలిచింది: మున్సిపల్ చైర్మన్ నరేందర్ ముదిరాజ్

గోవా క్యాంపు నుంచి విజయం సాధించామంటూ చూపుతున్న మున్సిపల్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు

అవిశ్వాసం వీగిపోయిన తర్వాత విలేకరులతో మాట్లాడుతున్న ఆర్డీవో వెంకటరెడ్డి, కమిషనర్ ప్రదీప్‌కుమార్

మణికొండ, ఫిబ్రవరి 22: మణికొండ మున్సిపాలిటీ చైర్మన్ పదవిపై అత్యంత ఉత్కంఠతగా కొనసాగిన అవిశ్వాస తీర్మానం ఎట్టకేలకు వీగిపోయింది. మొదటి నుంచి అవిశ్వాసం నెగ్గి తీరుతుందని ధీమావ్యక్తంచేసిన అసమ్మతి వర్గం ఏమాత్రం పోటీ లేకుండానే చేతులెత్తేసింది. ఒకింత అవిశ్వాసం ఏకపక్షమే అని ఊహించి చివరకు బోర్లాపడింది. మణికొండ మున్సిపాలిటీ చైర్మన్ కస్తూరి నరేందర్ ముదిరాజ్‌పై అసమ్మతి కౌన్సిలర్లు ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. గురువారం ప్రిసైడింగ్ అధికారి, రాజేంద్రనగర్ ఆర్డీవో వెంకట్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్ సమక్షంలో నిర్వహించిన అవిశ్వాస తీర్మానానికి మొదటగా 8మంది కౌన్సిలర్లు 8వ వార్డు కౌన్సిలర్ నవీన్‌కుమార్(బీఆర్ఎస్), 7వ వార్డు కౌన్సిలర్ బి.పద్మారావు(అసమ్మతి కాంగ్రెస్ కౌన్సిలర్), 16వ వార్డు కౌన్సిలర్ పి.శైలజ(బీఆర్ఎస్), 4వ వార్డు కౌన్సిలర్ ఎన్.వందన నాగేష్(బీజేపీ), 1వ వార్డు కౌన్సిలర్ వి.హైమాంజలి(బీఆర్ఎస్), 15వ వార్డు కౌన్సిలర్ బి.కావ్య(బీఆర్ఎస్), 20వ వార్డు కౌన్సిలర్ కె.నాగలక్ష్మీ(ఇండిపెండెంట్), 13వ వార్డు కౌన్సిలర్ బి.శ్వేత(బీజేపీ) హాజరుకాగా, చివరి నిమిషంలో 19వ వార్డు కౌన్సిలర్ కె.రామకృష్ణారెడ్డి(బీఆర్ఎస్), 9వ వార్డు కౌన్సిలర్ శ్రీకాంత్‌స్వామి(బీజేపీ) ఇద్దరు కౌన్సిలర్లుతో మొత్తం 10మంది ఫ్లోర్‌కు హాజరైయ్యారు. కానీ 2/3 మెజార్టీ ప్రకారం 13మంది బలనిరూపణ చేయలేకపోవడంతో అవిశ్వాసం వీగిపోయినట్లు అధికారులు వెల్లడించారు. చైర్మన్‌గా తిగిరి కస్తూరి నరేందర్ యథావిధిగా కొనసాగుతారని ప్రిసైడింగ్ అధికారి వెల్లడించారు.

బెడిసికొట్టిన వ్యూహం..

ఎన్నో అంచనాలతో అవిశ్వాస తీర్మానం పెట్టిన అసమ్మతి కౌన్సిలర్ల వ్యూహం బెడిసికొట్టింది. నరేందర్ ఏకపక్ష నిర్ణయాలతోనే అభివృద్ధి కుంటుపడుతుందంటూ ఆరోపిస్తూ కౌన్సిలర్లు అవిశ్వాసానికి తెరలేపారు. దీనికి తోడు సొంత కాంగ్రెస్ కౌన్సిలర్లు సైతం తమకు ఖచ్చితంగా మద్దతు పలుకుతారని ఊహించిన అసమ్మతి వర్గానికి చుక్కెదురైయింది. 2వ వార్డు కౌన్సిలర్ వసంత్‌చౌహాన్(బీఆర్ఎస్) అందరి మద్దతును కూడగట్టేందుకు విశ్వప్రయత్నం చేసి చివరి నిమిషంలో అవిశ్వాసానికి రాలేదు. 12మంది మెజార్టీ ఉంటే తాను 13వ వ్యక్తిగా హాజరై అవిశ్వాసాన్ని నెగ్గిస్తానంటూ మున్సిపల్ వైస్‌చైర్మన్ కొండకల్ల నరేందర్‌రెడ్డి(బీజేపీ) మొదటి నుంచి చెబుతూ వచ్చారు. దీంతో అసమ్మతి వర్గం వ్యూహం బెడిసి కొట్టడంతో వీగిపోయిందని తెలుస్తుంది.

భయభ్రాంతులకు గురిచేశారు: అసమ్మతి కౌన్సిలర్లు

రాజకీయంగా తమకు మద్దతు పలికే కౌన్సిలర్లను భయాందోళనకు గురిచేయడంతో పాటు వివిధ రకాలుగా చైర్మన్ నరేందర్ వేధింపులకు గురిచేసి అవిశ్వాసానికి హాజరుకాకుండా చేశారని అసమ్మతి కౌన్సిలర్లు బి.పద్మారావు, కె.రామకృష్ణారెడ్డి, శ్రీకాంత్‌స్వామి, నవీన్‌కుమార్ ఆరోపించారు. తమ బలం 12 మంది ఉన్నప్పటికీ చైర్మన్ వర్గీయుల్లోనూ ముగ్గురు కౌన్సిలర్లు తమకు మద్దతు పలికేందుకు సిద్ధంగా ఉన్నా వారిని నగరంలో ఉండనీయకుండా గోవా క్యాంపునకు నరేందర్ తరలించారన్నారు. నిజంగా చిత్తశుద్ధి ఉంటే అవిశ్వాసంలో పాల్గొనేవారని..ఆ సత్తాలేకనే చైర్మన్ క్యాంపు రాజకీయాలు చేస్తున్నారని నైతికంగా తామే విజయం సాధించామని అసమ్మతి కౌన్సిలర్లు అన్నారు.

ధర్మమే నిలిచింది..

చివరకు ధర్మమే నిలిచింది. ప్రజా సంక్షేమం కోసం అనునిత్యం పనిచేస్తున్న నాపై కొంతమంది కౌన్సిలర్లు కక్ష పూరితంగా అవిశ్వాస తీర్మానం పెట్టి పదవి నుంచి దింపేందుకు విశ్వప్రయత్నాలు చేశారు. కౌన్సిలర్లు నా వైపే నిలిచారు. ఎన్ని కుయుక్తులు చేసి చివరకు ధర్మమే నిలిచింది. ఇక మున్సిపాలిటీని మరింత అభివృద్ధిబాటలో తీసుకువెళ్తా..

– కస్తూరి నరేందర్ ముదిరాజ్, మున్సిపల్ చైర్మన్

వార్షిక నివేదికను ఆవిష్కరిస్తున్న వక్తలు, డీఎస్ఎస్ కన్వీనర్ గెడ్డం ఝాన్సీ

మహిళలు అన్నిరంగాల్లో సమాన వాటా సాధించాలి

దళిత్ స్త్రీశక్తి కన్వీనర్ గెడ్డం ఝాన్సీ

ఖైరతాబాద్, ఫిబ్రవరి 22: దళిత, ఆదివాసీ మహిళలు అన్ని రంగాల్లో సమాన వాటాను సాధించేందుకు పోరాడతామని దళిత్ స్త్రీశక్తి కన్వీనర్ గెడ్డం ఝాన్సీ అన్నారు. దళిత్ స్త్రీశక్తి సంస్థ ఏర్పాటై 18 ఏండ్లు పూర్తయిన సందర్భంగా లక్డీకాపూల్‌లోని అంబేద్కర్ రిసోర్స్ సెంటర్‌లో గురువారం 'దళిత, ఆదివాసీ మహిళలు–సామాజిక న్యాయం' అంశంపై నిర్వహించిన సమావేశంలో ఝాన్సీ అధ్యక్షోపన్యాసం చేశారు. కార్యక్రమానికి వక్తలుగా ఐఎఫ్ఎస్ అంబాసిడర్ వినోద్‌కుమార్, ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎంఎఫ్ గోపీనాథ్, డాక్టర్ పద్మాకర్, అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ ప్రొఫెసర్ సుధారాణి, బీఎస్ఎన్ఎల్ ప్రిన్సిపల్ మేనేజర్ నెల్లి రామకృష్ణ, ప్రముఖ సైంటిస్ట్ చారులత మాట్లాడుతూ.. డీఎస్ఎస్ ఆధ్వర్యంలో 18 ఏండ్లుగా అనేక మహిళా, బాలల హక్కుల సమస్యలను పరిష్కరిస్తూ, వారి హక్కుల కోసం పోరాటం చేయడం ఎంతో హర్షించదగ్గ విషయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా డీఎస్ఎస్ 18వ వార్షిక నివేదికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వినయకళ, మహేశ్వర్‌రావు, రమణ, హరిరామ్ నాయక్, స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై అఖిలపక్ష సమావేశం

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 22: పారదర్శక ఓటరు జాబితాకు సహకరించాలని జూబ్లీహిల్స్ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, యూసుఫ్‌గూడ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సేవా ఇస్లావత్ పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో గురువారం సర్కిల్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. డీసీ ఇస్లావత్ మాట్లాడుతూ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఓటరు నమోదు, సవరణ, తొలగింపు, అభ్యంతరాలను తెలియజేయాలన్నారు. 18 ఏండ్లు నిండిన యువతతో పాటు ఆయా ప్రాంతాలకు కొత్తగా వస్తున్న వారిని ఓటరుగా నమోదు చేయించాలన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

అఖిలపక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఈఆర్వో సేవా ఇస్లావత్

చట్టసభల్లో బీసీల వాటా సాధిస్తాం

హిమాయత్‌నగర్, ఫిబ్రవరి 22: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బీసీ ల సంక్షేమాన్ని పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తుందని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్‌గౌడ్ అన్నారు. గురువారం హిమాయత్‌నగర్‌లోని సంఘం కార్యాలయం లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్‌లో బీసీ బిల్లుకు చట్టసభల్లో వాటా కల్పించాలని డిమాండ్ చేశారు. మార్చి 1 నుంచి మహా పాదయాత్ర చేపడుతామని ఆయన చెప్పారు. రాష్ట్రంలోని బీసీలు సామాజిక, రాజకీయ, ఉద్యోగ రంగాల్లో ఎదిగేందుకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో బీసీ కులాల లెక్కలు లేకపోవడంతో సగానికి పైగా ఉన్న బీసీలకు అన్ని రంగాల్లో తీరని అన్యాయం జరుగుతుందన్నారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లను పెంచాలని కోరారు.

బకాయిదారు నుంచి రూ.14,69,816లను ఆస్తిపన్ను చెక్కును స్వీకరిస్తున్న ఏఎంసీ కమల్

ఆస్తిపన్ను వసూలుకు స్పెషల్ డ్రైవ్

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 22: ఆస్తిపన్ను వసూలుకు స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నామని యూసుఫ్‌గూడ సర్కిల్ ఏఎంసీ ఎస్‌వై కమల్ తెలిపారు. గురువారం ప్రత్యేక బృందాలతో ఆస్తిపన్ను వసూలు చేపట్టినట్లు తెలిపారు. కమల్ మాట్లాడుతూ వందశాతం ఆస్తిపన్ను వసూలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. యూసుఫ్‌గూడ సర్కిల్‌లో 2023–24 ఆర్థిక సంవత్సరానికి రూ.33.73 కోట్ల ఆస్తిపన్ను వసూలు చేయాల్సి ఉండగా ఇప్పటివరకు రూ.20 కోట్లపైగా వసూలైనట్లు తెలిపారు. పన్ను చెల్లించకుండా మొండికేస్తున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. అదనపు పెనాల్టీ భారం పడకుండా ప్రాపర్టీ ట్యాక్స్‌ను చెల్లించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

అధ్వానంగా రహదారి..

బండ్లగూడ, ఫిబ్రవరి 22: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కిస్మత్‌పూర్ వద్ద రోడ్డు అధ్వానంగా మారింది. దీంతో వాహనదారులు నిత్యం ప్రమాదాలబారిన పడుతున్నారు. కాగా.. ఇటీవల కాలంలో హెచ్ఎండీఏ అధికారులు దర్గాఖలీజ్‌ఖాన్ నుంచి కిస్మత్‌పూర్ వివేకానంద విగ్రహం వరకు 2.4కి.మీమేర రూ.5.90కోట్లతో బీటీ రోడ్డు పనులు చేపట్టారు. అధికారుల నిర్లక్ష్యంతో రోడ్డు నాసిరకంగా వేయడంతో పాటు మ్యాన్‌హోల్స్‌కు ఎలాంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో రోడ్డు గుంతలమయంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

బిల్లులు ఆడగంతో పనులు నిలిచాయి : డీఈ

దర్గాఖలీజ్‌ఖాన్ నుంచి కిస్మత్‌పూర్ వరకు ఉన్న బీటీ రోడ్డుపై మరో లేయర్ వేయాల్సి ఉందని, ప్రభుత్వం బిల్లులు నిలిపివేయడంతో పనులు నిలిచిపోయాయని హెచ్ఎండీఏ డీఈ రవీందర్ పేర్కొన్నారు .మ్యాన్‌హోళ్లకు మరమ్మతులు చేపడుతామని తెలిపారు.



వైద్యశాల విభాగాలను ప్రారంభిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహా

పేదలకు మెరుగైన వైద్య సేవలందించాలి

అత్తాపూర్, ఫిబ్రవరి 22: పేదలకు అతి తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్యం అందించే దిశగా జర్మెంటెన్ దవాఖాన కృషి చేయాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా తెలిపారు. రాజేంద్రనగర్ సర్కిల్ అత్తాపూర్‌లో జర్మెంటెన్ వైద్యశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన రోబోటిక్ జాయింట్ రీప్లేస్మెంట్, నూతన ఆర్థోపెడిక్ బ్లాక్, కార్డియాలజీ విభాగం, అడ్వాన్స్ క్యాథ్‌ల్యాబ్‌ను మంత్రి ప్రారంభించారు. ప్రైవేటు వైద్యశాలల నిర్వాహకులు పేదలకు తక్కువ ఖర్చుతోనే మెరుగైన వైద్య సేవలు అందేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో దవాఖాన చైర్మన్, ఎండీ డాక్టర్ మీర్ జావేద్ జర్‌ఖాన్, సీఈవో జైరాం ఆనంద్‌బాబు, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ మీర్ ఖాలీద్‌ఆలీ, సీవోవో హుమేర్ నూషీన్, సీబీవో మహమ్మూద్ ఓమర్‌ఖాన్ పాల్గొన్నారు.

6న స్వర్ణగిరి వేంకటేశ్వరాలయ ప్రారంభోత్సవం

ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న డీఎన్వీ ప్రసాద్, రామారావు, మురళీకృష్ణ, గోపీకృష్ణ

ఖైరతాబాద్, ఫిబ్రవరి 22: యాదాద్రి భువగిరి జిల్లాలోని మానేపల్లిహిల్స్‌లో నిర్మించిన స్వర్ణగిరి వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని మార్చి 6న ప్రారంభిస్తున్నట్లు మానెపల్లి డైరెక్టర్లు మానేపల్లి రామారావు, మురళీకృష్ణ, గోపీకృష్ణ తెలిపారు. పంజాగుట్టలోని మానేపల్లి జూవెల్రర్స్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆహ్వానపత్రిక, క్యాలెండర్‌ను సమతామూర్తి విగ్రహ చీఫ్ ఆర్కిటెక్ట్ డీఎన్వీ ప్రసాద్‌తో కలిసి ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ.. 22ఎకరాల విస్తీర్ణంలో ఆలయంలో స్వామివారితోపాటు పద్మావతి, గోదాదేవి, మదనగోపాలకృష్ణస్వామి, గరుడాల్వార్, రామానుజాచార్య ఉపాలయాలు నిర్మించామన్నారు. మార్చి 1 నుంచే పూజలు జరుగుతాయని, 6న త్రిదండి రామానుజ చినజీయర్‌స్వామి చేతుల మీదుగా ప్రాణప్రతిష్ఠ చేయనున్నట్లు తెలిపారు.

నెలలు గడుస్తున్నా పనులు చేపట్టరా..

బండ్లగూడ, ఫిబ్రవరి 22: తీర్మానాలు చేసి నెలలు గడుస్తున్నా పనులను చేపట్టడం లేదని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ 19వ డివిజన్ కార్పొరేటర్ నాగుల స్రవంతి కార్పొరేషన్ కార్యాలయం ఎదుట గురువారం నిరసన తెలిపారు. ఆమె మాట్లాడుతూ తమ డివిజన్ పరిధిలో 8 నెలల క్రితం పలు అభివృద్ధి పనుల కోసం తీర్మానం చేశామన్నారు. ఇప్పటి వరకు ఎలాంటి టెండర్లు పెట్టలేదని వాపోయారు. అధికారులకు అనుకూలంగా ఉన్న కార్పొరేటర్లకు ఎక్కువ మొత్తంలో టెండర్లు వెస్తున్నారని అవేదన వ్యక్తం చేశారు. స్పందించిన కమిషనర్ శరత్‌చంద్ర మాట్లాడుతూ.. ఎవరికీ అనుకూలంగా తాము టెండర్లు పెట్టడం లేదని, ప్రధాన్యతా క్రమంలో వేస్తున్నట్లు తెలిపారు. వచ్చే వారంలో 19వ డివిజన్‌లో టెండర్లు పెట్టడతామని చెప్పగా.. కార్పొరేటర్ నిరసన విరమించారు.

నిరసన తెలుపుతున్న కార్పొరేటర్ స్రవంతితో చర్చిస్తున్న మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్

ప్రేమపేరుతో బాలికకు వేధింపులు – యువకుడి అరెస్టు

నిందితుడు శ్రీనివాస్

బంజారాహిల్స్, ఫిబ్రవరి 22: బాలికను ప్రేమించాలంటూ వేధిస్తుండడంతో పాటు అసభ్యకరంగా మాట్లాడిన యువకుడిని జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. కృష్ణానగర్‌లో ఉండే బాలిక(16) పదో తరగతి చదువుతుంది. స్కూల్ ముగిసిన తర్వాత సమీపంలో ట్యూషన్‌కు వెళ్తున్న బాలికను అదే ప్రాంతంలో ఉంటున్న శ్రీనివాస్ కొంతకాలంగా వెంబడిస్తూ ప్రేమపేరుతో వేధిస్తున్నాడు. తనను ప్రేమించకపోతే అంతు చూస్తానంటూ బెదిరింపులకు పాల్పడుతుండడంతో పాటు అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడు. విషయాన్ని బాలిక తల్లి గుర్తించి గురువారం జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు నిందితుడు శ్రీనివాస్‌పై ఐపీసీ 354(డి), 506, 509తో పాటు పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

బండ్లగూడ, ఫిబ్రవరి 22: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం సాయంత్రం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు.. అత్తాపూర్ డివిజన్ పరిధిలోని కృష్ణానగర్‌కు చెందిన దశరథ్ (55) నగరంలోని ఎన్ఎండీసీలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆయన తన ఇంటి పత్రాలను డాక్టర్ పుల్లయ్యకు ఇచ్చి రిజిస్ట్రేషన్ చేశాడు. పుల్లయ్య వేరే వాళ్లకు విక్రయించాడు. ఇలా పలువురి చేతులు మారింది. గురువారం మధ్యాహ్నం ఇల్లు వద్దకు కొనుగోలుదారులు వచ్చి తమదేనని చెప్పి వెళ్లిపోయారు. దీంతో తీవ్ర మనోవేదనకు గురైన దశరథ్ ఇంట్లోకి వెళ్లగానే కిందపడిపోయాడు. కొద్దిసేపటికే మృతి చెందాడని స్థానికులు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

చిరు ఫార్మా సంస్థలపై అధికారుల దాడులు ఆపాలి

సమావేశంలో మాట్లాడుతున్న శ్రీహరి

ఖైరతాబాద్, ఫిబ్రవరి 22: రాష్ట్రంలోని చిరు ఫార్మసీ సంస్థలపై తనిఖీల పేరుతో అధికారులు జరుపుతున్న దాడులను నిలిపివేయాలని జై భీమ్ యూత్ ఇండియా ప్రతినిధి శ్రీహరి కోరారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశంలో తెలంగాణ ఫార్మా హబ్‌గా మారిన తరుణంలోఅనేక సంస్థలు ముందుకు వచ్చి తక్కువ ధరల్లోనే మందులు తయారు చేసి మార్కెట్‌లోకి పంపిస్తుందన్నారు. కార్పొరేట్ కంపెనీలతో పోల్చుకుంటే.. చిరు కంపెనీలకు సంబంధించిన మందులు సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండే ధరల్లోనే విక్రయిస్తున్నారన్నారు. కొన్ని బడా కంపెనీల చర్యల వల్ల ఇలాంటి సంస్థలపై దాడుల చేయడం తగదన్నారు. ఫార్మా క్లస్టర్లు ఏర్పాటు చేస్తున్నామని సీఎం ప్రకటించారని, చిన్న సంస్థలను కూడా రక్షించాల్సిన బాధ్యత ఆయనపై ఉందన్నారు. తక్షణమే దాడులను ఆపివేయాలని కోరారు. సమావేశంలో సంజయ్, నరసింహారావు, శంకర్,రాజేందర్ యాదవ్ పాల్గొన్నారు.

తెలంగాణ ద్రాక్షకు ప్రపంచ వ్యాప్తంగా డిమాండ్

ఫ్రూట్స్ విభాగం శాస్త్రవేత్త నాగహర్షిత

వ్యవసాయ యూనివర్సిటీ, ఫిబ్రవరి 22: ద్రాక్ష మనకు ఎంతో మేలు చేస్తుందని, తెలంగాణలో పండించిన ద్రాక్షకు ప్రపంచ వ్యాప్తంగా డిమాండ్ ఉందని శ్రీకొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం రాజేంద్రనగర్ ఉద్యాన కళాశాల ఫ్రూట్స్ విభాగం శాస్త్రవేత్త నాగహర్షిత అన్నారు. గురువారం రాజేంద్రనగర్‌లోని ఏఐసీఆర్పీ ద్రాక్ష పరిశోధనా కేంద్రాన్ని విద్యార్థులతో కలిసి సందర్శించారు. ఆమె మాట్లాడుతూ.. మన ప్రాంతంలో పండించే ద్రాక్ష భలే తీపిగా ఉంటుందని, ద్రాక్ష ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ద్రాక్షసాగు, రకాలు, వాడే విధానం, ఆరోగ్యానికి మేలు చేసే రకాలు, విద్యార్థులకు వివరించారు. ద్రాక్ష తెలంగాణలోని అన్ని ప్రాంతాల్లో సాగు చేయవచ్చని, రైతులను ద్రాక్ష సాగు వైపు మళ్లించడం, ఎగుమతులపై అవగాహన ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో సాయిల్డ్ విభాగం శాస్త్రవేత్తలు డాక్టర్ ప్రభావతి, డాక్టర్ వెంకట రమేశ్, సురేశ్ తదితరులు పాల్గొని ద్రాక్ష వల్ల ఉపయోగాలను విద్యార్థులకు వివరించారు.

విద్యార్థులకు ద్రాక్ష తోటపై అవగాహన కల్పిస్తున్న నాగహర్షిత

నా వెనుక కార్పొరేటర్... మా అల్లుడు డీఎస్పీ

- దిక్కున్న చోట చెప్పకోమన్న కబ్జారాయుడు
- స్థలం ఆక్రమించి.. బాధిత మహిళకు బెదిరింపులు
- పోలీసుల మీనమేషాలు
- డీసీపీ చొరవతో కేసు నమోదు

కేసు వివరాలను చూపుతున్న బాధితురాలు శారదాబాయి, కొడుకు రఘు

వెంగళరావునగర్, ఫిబ్రవరి 22: కార్పొరేటర్ మా వెనక ఉన్నాడు.. మా అల్లుడు డీఎస్పీ.. నేను తల్చుకుంటే బొక్కలిరగగొట్టి బొక్కలో వేయిస్తానంటూ ఓ మహిళను బెదిరింపులకు గురిచేశాడు కబ్జాదారుడు. మహిళ ఇంటికి దక్షిణాన ఖాళీగా వదిలేసిన స్థలంలో గోడను నిర్మించి కబ్జా చేసి బెదిరింపులకు దిగాడు. న్యాయం కోసం ఆ బాధితురాలు పోలీసు స్టేషన్ చుట్టూ మూడు వారాల నుంచి తిరుగుతున్నా పట్టించుకున్న పాపాన పోలేదు. చివరికి ఓ పోలీసు ఉన్నతాధికారి చొరవతో కోర్టు అనుమతితోఎట్టకేలకు పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితురాలు, పోలీసుల కథనం.. గద్వాల శారదాబాయి రహ్మత్‌నగర్‌లోని ఇంటి నంబర్8–3–228/376 చిరునామాలో 50 ఏండ్లుగా బిడ్డలతో కలిసి ఉంది. ఎనిమిదేండ్ల కింద ఆర్‌సీసీ రూఫ్‌తో పక్కా ఇంటిని కట్టుకున్నారు. వాస్తు ప్రకారం ఇంటికి దక్షిణం వైపు కొంత స్థలాన్ని వదిలిపెట్టి.. డ్రైనేజీ పైప్‌లైన్ పెట్టుకుని ఉపయోగించుకుంటున్నారు. కాగా ..శారదాబాయి ఊరెళ్లిన సమయంలో పక్కింటి బుచ్చయ్య ఆ స్థలాన్ని ఆక్రమించి గోడ కట్టేశాడు. తిరిగొచ్చాక బస్తీ పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టింది. గోడను తొలగిస్తానని అంగీకరించి మాట తప్పాడు. నిలదీస్తే.. కట్టె పట్టుకుని బుచ్చయ్య పైపైకి వస్తూ.. దౌర్జన్యానికి పాల్పడ్డాడు. నా వెనక రహ్మత్‌నగర్ కాంగ్రెస్ కార్పొరేటర్, అతని పీఏ రజనీకాంత్ ఉన్నాడని బెదింపులకు దిగాడు. అంతేగాకుండా తన కూతురు జలమండలి శాఖలో ఉన్నతాధికారి అని, తన అల్లుడు పోలీసు శాఖలో డీఎస్పీ అనీ.. నీ పిల్లల పై కేసులు పెట్టి బొక్కలిరగొట్టి బొక్కలోకి తోయిస్తానని తీవ్రంగా బెదిరించాడు. దౌర్జన్యానికి పాల్పడుతున్న బుచ్చయ్యపై బాధితురాలు ఈ నెల 3న మధురానగర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు పట్టించుకోకపోడంతో వెస్ట్ జోన్ డీసీపీ విజయ్‌కుమార్‌ను కలిసి తన గోడు వెళ్లబోసుకుంది. నిందితుడిపై చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని బాధితురాలు కోరారు.

ఎట్టకేలకు కేసు నమోదు

బాధితురాలి గోడు విన్న డీసీపీ వెంటనే స్పందించారు. కేసు నమోదు చేయకుండా కాలయాపన చేసిన మధురానగర్ పోలీసులపై డీసీపీ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు బాధితులు తెలిపారు. డీసీపీ చొరవతో ఎట్టకేలకు మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఏటీఎంలో చోరీకి యత్నం

అలారం మోగడంతో అప్రమత్తం.. ఇద్దరు నిందితులు అరెస్టు



నిందితులు చేవెళ్ల కృష్ణ, కృష్ణ

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 22: శంషాబాద్ పట్టణంలోని యూనియన్ బ్యాంకు ఏటీఎంలో డబ్బులు దోపిడీ చేయడానికి ఇద్దరు వ్యక్తులు విఫలయత్నం చేశారు. గురువారం శంషాబాద్ ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ జరిగిన ఘటన జరిగింది. సీఐ బాలరాజు తెలిపిన వివరాలు.. రాళ్లగూడ రోడ్డులోని ఏటీఎంలో డబ్బులు దోచుకోవడం కోసం ఇద్దరు వ్యక్తులు ప్రయత్నిస్తుండగా అలారం మోగింది. ద